సాక్షి శ్రీకాకుళం

శుక్రవారం । 21 । జూన్ । 2024



పంటకు జీవం

జీవన ఎరువులతో విశేష ప్రయోజనాలు సమకూరుతాయి. దిగుబడులతో పాటు పర్యావరణానికి మేలు కలుగుతుంది. - 8లో



ఎన్నికలు ప్రశాంతంగా..

జిల్లాలో పోలీసు అధికారులు, సిబ్బంది సహకారంతో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా పూర్తి చేశామని ఎస్పీ జి.ఆర్.రాధిక అన్నారు. - 8లో

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

ఎచ్చెర్ల/ ఎచ్చెర్ల క్యాంపస్ : ఎచ్చెర్లలోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఈ నెల 25 నుంచి జిల్లాలోని గ్రామీణ ప్రాంత మహిళల కోసం టైలరింగ్‌లో 30 రోజుల ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయని సంస్థ డైరెక్టర్ కల్లూరి శ్రీనివాసరావు తెలిపారు. శిక్షణా కాలంలో ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పించనున్నామని చెప్పారు. వివరాలకు 7993340407, 9553410809 నంబర్లను సంప్రదించాలని కోరారు. 19 నుంచి 45 ఏళ్ల మధ్య మహిళలు అర్హులని, ఈ నెల 25 నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని తెలిపారు.

న్యూస్‌రీల్

డిగ్రీ, బీఎడ్ సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ ఆరో సెమిస్టర్, బీఎడ్ మూడో సెమిస్టర్ ఫలితాలను గురువారం విడుదల చేశారు. ఫలితాలను జ్ఞాన భూమి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ చెప్పారు. డిగ్రీ ఆరో సెమిస్టర్ ఇంటర్న్‌షిప్‌కు 9832 మంది హాజరు కాగా, 9777 మంది ఉత్తీర్ణత సాధించారు. 99.44 శాతం ఉత్తీర్ణత నమోదైంది. కోర్సుల వారీగా బీఏలో 1235 మందికి 1229 మంది, బీబీఏలో 160 మందికి 155 మంది, బీసీఏలో 158 మందికి 156 మంది, బీకాంలో 1519 మందికి 1509 మంది, బీఎస్సీలో 6760 మందికి 6728 మంది ఉత్తీర్ణత సాధించారు. బీఎడ్ మూడో సెమిస్టర్‌లో 1027 మందికి 875 మంది పాసయ్యారు. కళాశాలలకు మార్కుల జాబితాలు అందజేయనున్నట్లు ఎగ్జామినేషన్స్ డీన్ తెలిపారు. అవసరం అనుకున్న విద్యార్థులు రీవాల్యుయేషన్‌కు 15 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

శ్రీముఖలింగంలో మైనాకోత్సవం



మైనాకోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో పాంచరాత్రి కల్యాణ ఉత్సవాల్లో భాగంగా జేష్ఠమాసం ఐదో గురువారం స్వామివారికి మైనాకోత్సవం ఘనంగా జరిగింది. ప్రత్యేక పూజలు, హోమం బలిహరణ అనంతరం పార్వతి పరమేశ్వరులకు తిరువీధి ఉత్సవం నిర్వహించారు. అదే సమయంలో పార్వతి, పరమేశ్వరుల వివాహ మహోత్సవం నచ్చని మైనాకుడు స్వామివారి గృహాన్ని దహనం చేయడంతో ఈ ఘట్టాన్ని మైనాకోత్సవంగా నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ జ్వరాలపై అప్రమత్తం



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: గ్రామ స్థాయి నుంచే శానిటేషన్ పనులు ప్రారంభించాలని కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అధికారులను ఆదేశించారు. వెక్టర్ బోర్న్ డిసీజెస్‌పై కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో జిల్లా మలేరియా అధికారి ఎం.సత్యనారాయణ, ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ ప్రసాదరావు, జెడ్పీ సీఈవో వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ జిజె బెన్హర్, డీపీఓ వెంకటేశ్వరరావు, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఉమామహేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్లు, డీఈఓ వెంకటేశ్వరరావు, బీసీ వెల్ఫేర్ అధికారి అనూరాధ, మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ పాల్గొన్నారు.

26న డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీ

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కళాశాల వద్ద జూన్ 26న అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకొని నిర్వహించే సైకిల్ ర్యాలీలో యువత పాల్గొనాలని ఎస్పీ జి.ఆర్.రాధిక పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజల్లో అవగాహన కల్పించేలా మూడు నిమిషాల షార్ట్‌ఫిల్మ్‌ను చిత్రీకరించి పీఆర్‌వో(6309990940)కు జూన్ 25 తేది ఉదయానికి వాట్సాప్ ద్వారా పంపించాలని కోరారు. ప్రథమ బహుమతి రూ.5 వేలు, ద్వితీయ బహుమతి రూ.3 వేలు అందిస్తామన్నారు.



యోగా వికాసం

- యోగ సాధనపై ప్రజల్లో పెరుగుతున్న ఆసక్తి
- జిల్లాలో వెల్లువలా యోగా కేంద్రాలు
- స్ఫూర్తిగా నిలుస్తున్న జిల్లా యోగా గురువులు
- ఆసనాలతో అబ్బురపరుస్తున్న అభ్యాసకులు
- నేడు ప్రపంచ యోగా దినోత్సవం

వైద్యశాస్త్రం కొత్త పుంతలు తొక్కుతున్నా.. ఆధునిక జీవన శైలికి మనిషి ఎంత ఎడిక్ట్ అవుతున్నా మన పురాతన ఆరోగ్య విధానాలు అందరినీ ఆకర్షిస్తున్నాయి. ఆధునిక వైద్యం నయం చేయలేని ఎన్నో రుగ్మతలను ఇవి నయం చేస్తుండటం, క్రమం తప్పిన మన జీవన విధానాన్ని మళ్లీ గాడిలో పెట్టి.. సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దే శక్తి ఉన్నందునే యోగా, ధ్యానం వంటి మన సంప్రదాయ విధానాల వైపు ప్రపంచం మొత్తం మొగ్గు చూపుతోంది. ఇందులోనే జల యోగా వంటి అనేక కొత్త ప్రక్రియలను కూడా యోగా సాధకులు అందుబాటులోకి తెస్తున్నారు.

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా సమాజంలో యోగా వికాసంపై ప్రత్యేక కథనం..



ఉష్ట్రాసనం

శ్రీకాకుళం కల్చరల్/ఎచ్చెర్ల క్యాంపస్/ ఆమదాలవలస/ఇచ్ఛాపురం:

శారీరక, మానసిక ప్రశాంతతకు ఏకైక మార్గంగా నిలుస్తున్న యోగ సాధన పట్ల జిల్లా ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు ముందస్తుగా యోగ, ధ్యానం వంటి ప్రక్రియలు క్రమం తప్పకుండా చేపడుతూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకుంటున్నారు. ఇందుకోసం జిల్లావ్యాప్తంగా యోగా నేర్పే కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి. ముఖ్యంగా జిల్లా కేంద్రంలో పదుల సంఖ్యలో యోగా సెంటర్లు వెలిశాయి. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పలువురు యోగాభ్యాసకులు రాణిస్తూ నవతరానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

బహుళ ప్రయోజనాలు..

- యోగా, ధ్యానం, ప్రాణాయామం లాంటి ప్రక్రియలు మానసిక ప్రశాంతతను కలిగించి సంపూర్ణ ఆరోగ్యానికి దోహదపడతాయి. మానసిక ఒత్తిళ్లు, హృద్రోగం, రక్తపోటు లాంటి వ్యాధుల తీవ్రత తగ్గించడానికి ఉపకరిస్తాయి.
- యోగాలో ప్రధానంగా ఐదు రకాల ఆసనాలు ఉంటాయి.

1. **కూర్చుని చేసే ఆసనాలు**- వజ్రాసనం, పద్మాసనం
2. **నిల్చుని వేసే ఆసనాలు**- వృక్షాసనం, నటరాజ ఆసనం
3. **బోర్లా పడుకుని వేసే ఆసనాలు**- భుజంగాసనం, ధనురాసనం
4. **వెల్లకిలా పడుకొని వేసే ఆసనాలు**- పవన ముక్తాసనం
5. **తలకిందులుగా వేసే ఆసనాలు** - శీర్షాసనం, సర్వంగాసనం

మహిళలకు మేలు..

- మహిళల్లో వచ్చే సమస్యలు అధిగమించేందుకు ప్రత్యేక ఆసనాలు ఉన్నాయి. వాటిలో కొన్నింటిని పరిశీలిస్తే..

1. **కోణాసనం:** వెన్నెముక, కాళ్లకు, చేతులకు బలం కలుగుతుంది. భుజాలు శక్తివంతమవుతాయి. కొవ్వు కరుగుతుంది. అతిమూత్రం, రక్తపోటు నివారిస్తుంది. పొట్ట పెరగకుండా అరికడుతుంది.
2. **బద్ధపరివృత పార్శ్వ కోణాసనం:** మెదడుకు రక్త ప్రసరణ, స్పైనల్ కార్డుకు మసాజ్ అవుతుంది.
3. **సేతు బందాసనం:** నరాల బలహీనత తగ్గిస్తుంది. థైరాయిడ్ సమస్య నివారిస్తుంది. నడుం నొప్పి, మెడనొప్పి నివారిస్తుంది. ఛాతీలో కొవ్వు కరిగిస్తుంది.
4. **ఉతిత పార్శ్వ పాద ఉపవేసాసనం:** పాదాలు, కాళ్లు సాగుతాయి. చేతుల సపోర్టు చేయడం వల్ల భుజాల నుంచి అరచేతుల వరకు సాగుతాయి. దీనివల్ల కాళ్లలోని నరాల ఉబ్బులు తగ్గి, బ్లడ్‌క్లాట్స్ కరుగుతాయి.
5. **రామబాణం:** నడుం నొప్పి తగ్గుతుంది. డిస్క్ సమస్య, సయాటికా రోగులకు మేలు జరుగుతుంది.
6. **ఉష్ట్రాసనం:** వెన్నెముక, తలకు రక్తప్రసరణ సక్రమంగా జరుగుతుంది. జీర్ణశక్తి వృద్ధి అవుతుంది.
7. **పార్శ్వ ఉత్తాన ఆసనం:** భుజాల నుంచి చేతి వేళ్ల వరకు రక్తప్రసరణ సాఫీగా జరుగుతుంది.



సేతు బందాసనం

● నీటిపై తేలియాడుతూ..

యోగాలో సాధారణంగా నేలపై ఉండి ఆసనాలు వేస్తారు. అయితే శ్రీకాకుళం పట్టణానికి చెందిన డాక్టర్ యార్లగడ్డ గీతా శ్రీకాంత్ వినూత్నంగా నీటిపై యోగాసనాలు వేస్తూ ఆకట్టుకుంటున్నారు. తన కుమార్తెను స్విమ్మింగ్ పూల్‌కు తీసుకెళ్లినపుడు ఈ ఆలోచన వచ్చిందని, నాటినుంచి జలయోగా సాధన ప్రారంభించినట్లు గీతా శ్రీకాంత్ తెలిపారు. పదేళ్ల క్రితం వెన్నెముక ఆపరేషన్ జరగ్గా నడకపై భయం మొదలైందని, ఈ సమయంలో ధృఢ సంకల్పంతో జలయోగ, ధ్యానం, ప్రాణాయామం, సుదర్శన క్రియతో ఆరోగ్యం కుదుట పడిందని చెప్పారు. పద్మాసనం, పశ్చిమోత్తాన ఆసనం, సుఖాసనం, మకరాసనం, నౌకాసనం, త్రికోణాసనం, ధనురాసనం వంటి 30 రకాల ఆసనాల్లో పట్టు సాధించినట్లు తెలిపారు.

బీఆర్ ఏయూలో యోగా కోర్సులకు డిమాండ్

ఆరోగ్యం, విద్యార్హత రెండు ప్రయోజనాలు ఉండటం వల్ల యోగా కోర్సుల్లో చేరేందుకు యువత, ఉద్యోగులు ప్రాధాన్యమిస్తున్నారు. ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో యోగా అండ్ ఫిట్‌నెస్ విభాగాన్ని 2015లో ప్రారంభించారు. ఏడాది కోర్సు పోస్టు గ్రాడ్యుయేషన్ యోగా డిప్లొమా. రెండు సెమిస్టర్లు ఉంటాయి. రూ.10 వేలు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. 40 సీట్లు అందుబాటులో ఉంటాయి. రెండో కోర్సు డిప్లొమా ఇన్ యోగా. ఇది ఆరేళ్ల కోర్సు. ఒక్క సెమిస్టర్ పరీక్ష ఉంటుంది. కోర్సు ఫీజు స్ట్రక్చర్ రూ.5 వేలు. ఉద్యోగులు, ఉన్నత విద్య చదువుతున్న విద్యార్థుల సౌకర్యార్థం సాయంత్రం 4 నుంచి రాత్రి 7 గంటలు వరకు తరగతులు నిర్వహిస్తున్నారు.

● సత్తాచాటుతున్న శ్రీకాంత్..

ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన శ్రీకాంత్ మహంతి శరీరాన్ని విల్లులా వంచుతూ యోగసనాలు వేస్తూ అబ్బురపరుస్తున్నాడు. పాఠశాలస్థాయిలోనే వ్యాయామ ఉపాధ్యాయురాలు జయలక్ష్మి, స్థానిక యోగా సాధకుడు మధుసూదన్‌బెహరాలు ప్రోత్సాహం, కఠోర శ్రమ తోడవడంతో ప్రతీ పోటీలోనూ విజయాలు సాధిస్తూ అంతర్జాతీయ వేదికలపై జిల్లాకు పేరుప్రఖ్యాతులను ఇనుమడింప చేస్తున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ద్వారా శిక్షణ తీసుకొని యోగాసనాల పోటీలకు లెవల్-2 జడ్జిగా వ్యవహరిస్తున్నారు.



ప్రత్యేక తరగతులు..



యోగా పీజీ డిప్లొమా, డిప్లొమా కోర్సుల్లో చేరేందుకు చాలా మంది ప్రాధాన్యమిస్తున్నారు. ఉన్నత విద్య చదువుతున్న విద్యార్థులు, ప్రభుత్వ ప్రైవేట్ సంస్థల ఉద్యోగులు చేరుతున్నారు. ఎవ్వరికీ ఇబ్బంది లేని సమయం సాయంత్రం వేళల్లో క్లాస్‌లు నిర్వహిస్తున్నాం.

– డాక్టర్ కంచరాపు తారక రామారావు, విభాగాధిపతి, యోగా అండ్ ఫిట్‌నెస్ డిపార్టుమెంట్

● అబ్బురపరుస్తున్న 'నక్షత్ర' ఆసనం



పట్టణంలోని సానావీధిలో నివాసముంటున్న బొడ్డేపల్లి శ్రీనివాసరావు, శ్రీలత దంపతుల కుమార్తె నక్షత్ర నాలుగేళ్ల వయసునుంచే యోగాసనాలను ప్రదర్శిస్తూ ఆకట్టుకుంటోంది. ఇటీవల యోగా కేంద్రంలో శిక్షణ పొంది ముగింపు కార్యక్రమంలో ప్రదర్శన చేసి పలువురి ప్రశంసలు అందుకుంది.

● ఆలిండియా పోలీస్ గేమ్స్‌లో..



విశాఖలో ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న సమయంలో ఓ కానిస్టేబుల్ వద్ద మొదటిగా యోగా నేర్చుకున్నాను. స్వగ్రామం నరసన్నపేట వద్ద జమ్ము నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ పలు పోటీల్లో పాల్గొన్నాను. ఈ ఏడాది జనవరి 9న 216 సార్లు సూర్యనమస్కారాలను 88 నిమిషాలలో పూర్తి చేసి ప్రపంచ రికార్డు సాధించాను. విశాఖలో జరిగిన ఆల్ ఇండియా పోలీస్ గేమ్స్‌లో యోగా విభాగంలో బంగారు పతకం సాధించాను. సౌత్‌కొరియాలో జరిగిన ఏషియన్ లెవల్ ఓపెన్ పోటీల్లో గోల్డ్, బ్రాంజ్ మెడల్స్ సాధించాను. నా కుమార్తెలు వైష్ణవి, వాగ్దేవిలు యోగా పోటీల్లో పతకాలు సాధించారు. నా భర్త కూడా 108 సార్లు సూర్యనమస్కారాలు ప్రదర్శించి రికార్డు సాధించారు.

– టెంక కల్యాణి, ఇన్‌స్పెక్టర్, దిశా పోలీసు స్టేషన్, విశాఖపట్నం

● యోగా కేంద్రాలివే..

శ్రీకాకుళం నగరంలో 27కు పైగా యోగా కేంద్రాలు నడుస్తున్నాయి. వీటిలో రెండు వేల మంది వరకు యోగా సాధన చేస్తున్నారు. ఇవే కాకుండా ఆన్‌లైన్‌లో కూడా కొందరు యోగా తరగతులు నిర్వహిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా ఆయుర్వేద వైద్యశాలలో యోగాభ్యాస సాధన చేయిస్తున్నారు. ఇందు కోసం ఒక టీచర్‌ను కూడా ఏర్పాటు చేశారు.

1.నరసింహమూర్తి	యోగా గురువు, అరసవల్లి	94401 52146
2.లక్ష్మణరావు	యోగా గురువు, గూనపాలెం	94904 06455
3.జి.లక్ష్మి	యోగా గురువు, చిన్మయామిషన్	99594 87537
4.ఎం.కవిత	యోగాగురువు, ఎల్‌బీఎస్ కాలనీ	63013 64448
5.పి.శారద	యోగాగురువు, ఎల్‌బీఎస్ కాలనీ	94490 56969
6.ఎం.శ్రీదేవి	యోగా గురువు, ఎ.పి.హెచ్‌బీ కాలనీ	79956 74835
7.ఎస్.దేవలక్ష్మి	మావూరు వీధి	93953 10287
8.ఆర్‌ఎస్ పట్నాయిక్	ఏపీహెచ్‌బీ కాలనీ	94917 02024
9.ఎ.కుమారస్వామి	గుజరాతిపేట	83418 04804
10.ఎస్.సుధారాణి	గుజరాతిపేట(మహిళలు)	99123 77173
11.ఈశ్వరప్రసాద్ పట్నాయిక్	సత్యసాయి మందిరం, పీఎన్‌కాలనీ	93953 73980
12. కె.నాగలక్ష్మి	పీఎన్‌కాలనీ పార్కు	91826 06731
13.కృష్ణారావు	నారాయణ తిరుమల	90526 25685
14.ప్రగడ లక్ష్మి	నారాయణ తిరుమల(మహిళ)	83330 80468
15.పి.లీలావతి	నారాయణ తిరుమల(మహిళ)	70329 10050
16.ఎస్.సుధారాణి	కృష్ణార్జున మందిరం,బొంతావారివీధి	99123 77173
17.వి.వేంకటేశ్వరరావు	పెద్దమందిరం	93906 10919
18.ఎం.నాగలక్ష్మి	సాయిసత్యనిలయం, పీఎన్ కాలనీ	91826 06731
19.ఎస్.సుధారాణి	రామాకృష్ణ టాకీస్ ఎదురుగా..	99123 77173
20. తంగి స్వాతి	బ్యాంకర్స్ కాలనీ(మహిళ)	94902 83787
21.ఓంకారస్వామి	ఇందిరానగర్, విశాఖ-బి కాలనీ	70325 77602
22.మురళీకృష్ణ	షిరిడి సాయిమందిరం విశాఖ-బీ కాలనీ	96763 49697
23. వెంకటరావు	షిరిడి సాయిమందిరం, విశాఖ-బీ కాలనీ	99590 32021
24.సిహెచ్ జనార్దనదాస్	బలగ	94401 53334
25.బి.పద్మజ	పాత్రునివలస	93989 15950
26.బొమ్మల లక్ష్మి	పుణ్యపు వీధి	70138 66340
27. అమ్ములు	9వ లైను, పీఎస్ కాలనీ	88862 29498

● బంగారు 'లక్ష్మి'..



ఢిల్లీలో జరిగిన పోటీల్లో స్వర్ణ పతకం అందుకుంటున్న లగుడు లక్ష్మి

ఎంతటి ఆసనమైనా అవలీలగా వేస్తూ ఆకట్టుకుంటున్నారు ఆమదాలవలసకు చెందిన లగుడు లక్ష్మి. యోగా గురువు, భర్త అప్పన్న వద్ద శిక్షణ పొంది 55-65 ఏళ్ల విభాగంలో జాతీయ స్థాయిలో సత్తా చాటుతున్నారు. ఏడాది వ్యవధిలో పలు పోటీల్లో పాల్గొని 10 బంగారు పతకాలు సాధించడం విశేషం. ప్రస్తుతం ఆమదాలవలసలోని పతంజలి యోగా శిక్షణ కేంద్రంలో పలువురికి ఉచితంగా యోగా శిక్షణ ఇస్తున్నానని, ప్రభుత్వం స్థలం కేటాయించిందని, నిధులు మంజూరు చేస్తే మరింత ఎక్కువ మందికి శిక్షణ అందించడానికి అవకాశం ఉంటుందని లక్ష్మి చెబుతున్నారు.

నా పుస్తకం ఆధారంగానే..



నేను 22ఏళ్లుగా యోగాభ్యాసం చేస్తున్నాను. శ్రీకాకుళంలో యోగాచార్య రామారావు వద్ద నేర్చుకున్నాను. తరువాత బెంగళూరు అంతర్జాతీయ యోగా యూనివర్సిటీలో యోగాలో డిప్లొమో చేశాను. నగరంలో 27 కేంద్రాలలో యోగా తరగతులు జరుగుతున్నాయి. నేను రచించిన యోగా పుస్తకం ఆధారంగానే అంబేడ్కర్ యూనివర్సిటీలో యోగా క్లాసులు నిర్వహిస్తున్నారు.

– మావూరి నాగేశ్వరరావు, యోగా గురువు

39 ఏళ్లుగా యోగా సాధన..



గత 39ఏళ్లుగా యోగా సాధన చేయడంతో పాటుగా ఎంతో మందికి ఉచితంగా యోగాలో శిక్షణ ఇస్తున్నాను. జిల్లాకు వచ్చిన ఇద్దరు కలెక్టర్లకు కూడా యోగా నేర్పాను. మూడేళ్లుగా హైదరాబాద్‌లోని ప్రీ గురుకుల్ సేవా సంస్థలో యోగా, ప్రాణాయామం తరగతులను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నాను. రెడ్‌క్రాస్‌లో కూడా సేవలను అందించాను.

– ఎం.వి.రామారావు, విశ్రాంత ఏఈ, బీఎస్ఎన్ఎల్, శ్రీకాకుళం

274 మొబైల్ ఫోన్ల రికవరీ

- బాధితులకు అందజేసిన ఎస్పీ రాధిక
- సీఈఐఆర్ పోర్టల్‌ను వినియోగించుకోవాలని పిలుపు



బాధితులు, సైబర్‌సెల్ టీమ్‌తో ఎస్పీ రాధిక, అదనపు ఎస్పీలు

శ్రీకాకుళం క్రైమ్ : కొన్ని అనుకోని పరిస్థితుల్లో ఎవరైనా తమ మొబైల్ ఫోన్లను పోగొట్టుకుంటే డిపార్ట్‌మెంట్ ఆఫ్‌ది టెలి కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) పోర్టల్ ద్వారా తిరిగి పొందే అవకాశముంటుందని ఎస్పీ జి.ఆర్.రాధిక తెలిపారు. ఇంతకుముందు 'శ్రీకాకుళంపోలీస్.ఇన్' వెబ్‌సైట్ ద్వారా అందుబాటులో ఉంచిన లాస్ట్ మొబైల్ ట్రాకింగ్ సిస్టమ్ ద్వారా 244 ఫోన్లను రికవరీ చేసి ఇచ్చామన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో బాధితులని పిలిచి సీఈఐఆర్ ద్వారా 202 మొబైళ్లను, ఎల్ఎంటీఎస్ ద్వారా 72 ఫోన్లు కలిపి మొత్తం 274 ఫోన్లను అందజేశామని చెప్పారు. మొత్తంగా ఇప్పటివరకు రూ. 64 లక్షలు విలువైన 518 ఫోన్లను బాధితులకు అప్పగించినట్లు ఎస్పీ వెల్లడించారు.

సీఈఐఆర్ ద్వారా పొందేదిలా..

పోగొట్టుకున్న మొబైల్‌ను తిరిగి పొందేందుకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సీఈఐఆర్.జీఓవి.ఐఎన్ అనే పబ్లిక్ వెబ్‌సైట్‌కి వెళ్లి ముందుగా బ్లాకింగ్ రిక్వెస్ట్‌ను రిజిస్టర్ చేసుకోవాలి. మొబైల్ ఐఎంఈఐ నెంబర్లు బ్లాక్ చేశాక జిల్లాలోని సైబర్ సెల్ విభాగం రిక్వెస్ట్‌ను రిసీవ్ చేసుకుంటుంది. అనంతరం మొబైల్‌ను ట్రాక్ చేసి రికవరీ చేస్తారు. మొబైల్‌ను అన్‌బ్లాక్‌చేసి పోగొట్టుకున్న బాధితునికి అందజేస్తారు.

లాక్ అండ్ సెక్యూరిటీ తప్పనిసరి..

మొబైల్ ఫోన్లు వాడే ప్రతి ఒక్కరూ ఫోన్లకు లాక్ అండ్ సెక్యూరిటీ తప్పనిసరిగా వేసుకోవాలని ఎస్పీ స్పష్టం చేశారు. అందుబాటులో ఉన్న కొత్త సాఫ్ట్‌వేర్‌ల ద్వారా ఫోన్లలో ఉండే డేటాను సంరక్షించుకోవాలని, బిల్లు, ఐఎంఈఐ నెంబర్లు, ఇతర వివరాలు భద్రంగా దాచుకోవాలన్నారు. విలువైన సమాచారం ఫోన్లలో ఉండకుండా జాగ్రత్త వహించాలన్నారు. విలువైన ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేయడంలో కృషి చేసిన సైబర్ సెల్ సీఐ టి.శ్రీను, సిబ్బంది పైలా శరత్‌చంద్ర (చక్రి), శేష గిరి, రమేష్, అరవింద్, సుధీర్, సత్యనారాయణలను ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ప్రేమ్‌కాజల్, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'ఆ టీచర్లు పది రోజుల్లో రిపోర్టు చేయాలి'

శ్రీకాకుళం న్యూకాలనీ: దీర్ఘకాలిక సెలవు పెట్టి విధులకు దూరంగా ఉంటూ నిర్దేశిత గడువులోగా విధుల్లో చేరని కారణంగా జిల్లాలో ఇద్దరు ఉపాధ్యాయులకు విద్యాశాఖ డెడ్‌లైన్ విధించింది. నరసన్నపేట మండలం గెడ్డవానిపేట ఎంపీపీ స్కూల్ ఎస్‌జీటీ పి.గౌరీదేవి, శ్రీకాకుళం రూరల్ మండలం లింగాల ఎంపీపీ స్కూల్ ఎస్‌జీటీ టి.కృష్ణారావులు పది రోజుల్లోగా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని, లేనిపక్షంలో ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగిస్తామని డీఈఓ కె.వెంకటేశ్వరరావు స్పష్టంచేశారు. గౌరీదేవి 2021 అక్టోబర్ 18 నుంచి అనుమతి లేకుండా దీర్ఘకాలిక సెలవులు పెట్టగా.. అనేక నోటీసులు జారీ చేసినా స్పందన లేకపోయిందన్నారు. టి.కృష్ణారావు 2023 జనవరి ఒకటి నుంచి అనుమతి లేకుండా దీర్ఘకాలిక సెలవులో ఉండటం, పలుమార్లు మండల విద్యాశాఖాధికారులు నోటీసులు జారీచేసినా విధులకు హాజరుకాపోవడంతో ప్రవర్తనా నియమావళి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు.

550 లీటర్ల సారా ఊట ధ్వంసం



ఎర్రమానుగూడలో సారా ఊటలు ధ్వంసం చేస్తున్న పోలీసులు

మెళియాపుట్టి: మండలంలోని ఎర్రమానుగూడలో ఎస్ఈబీ బృందాలు గురువారం సారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించాయి. ఈ దాడుల్లో 550 లీటర్ల బెం ఊటను ధ్వంసం చేశారు. 40 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అక్రమ మద్యం తయారీ నేరమని, గిరిజన యువత భవిష్యత్ నాశనం చేసుకోవద్దని ఎస్ఈబీ పోలీసులు హితవుపలికారు. ఈ దాడుల్లో ఎస్ఈబీ ఎస్సై గణేష్, సిబ్బంది పాల్గొన్నారు.

లుట్టపేటలో పూరిల్లు దగ్ధం



కాలిపోయిన ఇల్లు

పొందూరు: మండలంలోని కొంచాడ పంచాయతీ లుట్టపేటలో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధమైంది. యువకులు సకాలంలో స్పందించడంతో పెను ప్రమాదం తప్పింది. టి.గోపి ఇంట్లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో అక్కడే ఉన్న యువకులు స్పందించి తాటికమ్మలను తొలగించారు. దీంతో పక్క ఇళ్లకు మంటలు వ్యాపించలేదు. ఈ ప్రమాదంలో గృహోపకరణాలు, టీవీ, వంట సామగ్రి కాలిబూడిదయ్యాయి.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



వ్యక్తి మృతదేహం

కాశీబుగ్గ: పలాస జీఆర్‌పీ పరిధిలోని పూండి రైల్వేస్టేషన్ ఫుట్‌పాత్‌పై గుర్తు తెలియని వ్యక్తి గురువారం అపస్మారక స్థితిలో కనిపించాడు. స్థానికులు గుర్తించి 108 అంబులెన్సుకు సమాచారం అందించడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యసేవలు అందిస్తుండగా మరణించినట్లు వైద్యులు వెల్లడించారు. మృతుడి వయసు 40 నుంచి 45 ఏళ్లు ఉంటుందని తెలిపారు. శ్రీకాకుళం, ఆమదాలవలస ప్రాంతాలకు చెందినవాడిగా అనుమానిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. జీఆర్‌పీ ఎస్ఐ షరీఫ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దేవదాయ మంత్రిని కలిసిన అరసవల్లి ఈఓ

అరసవల్లి: రాష్ట్ర దేవదాయశాఖ మంత్రిగా గురువారం బాధ్యతలు చేపట్టిన ఆనం రామనారాయణరెడ్డిని అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ ఈవో ఎస్.చంద్రశేఖర్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆదిత్యుని చిత్రపటాన్ని మంత్రికి అందజేశారు.

నేలకు సారం.. పంటకు జీవం

- జీవన ఎరువులతో విశేష ప్రయోజనాలు
- దిగుబడులతో పాటు పర్యావరణానికి మేలు

శ్రీకాకుళం రూరల్:

వ్యవసాయంలో రసాయన ఎరువులు వాడకం రోజురోజుకూ పెరిగిపోతోంది. దీనివల్ల నేల సారం కోల్పోవడమే కాకుండా రసాయన అవశేషాలు పంట దిగుబడిలో ఉండిపోయి అనారోగ్యం కలగజేస్తోంది. భూమిలోని సూక్ష్మజీవుల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడంతో నేలకు ఉన్న సహజ గుణాలు, సారం క్షీణించిపోతున్నాయి. పర్యావరణ కాలుష్యం కూడా ఎక్కువవుతోంది. ఈ నేపథ్యంలో జీవన ఎరువుల వాడకం ప్రాముఖ్యతను సంతరించుకుంది. వీటి వల్ల కలిగే ప్రయోజనాలను శ్రీకాకుళంలోని కృషి విజ్ఞాన కేంద్రం పరిశోధకులు వివరించారు.



ద్రవరూప జీవన ఎరువులు

నత్రజని అందించే ఎరువులు

రైజోబియం: పప్పు జాతి పంటలకు నత్రజనని అందించే జీవన ఎరువుగా వాడాలి. కంది, పెసర, మినుము, శనగ, వేరు శనగ, సోయాచిక్కుడు వంటి పైర్లకు రైజోబియంను విత్తనాలకు పట్టించి ఉపయోగించాలి. దీనివల్ల మొక్క వేర్లపై లేత గులాబి రంగు బుడిపెలు ఏర్పడతాయి. 100 మీ.లీ. నీటిలో 10 గ్రాముల పంచదార/బెల్లం/ గంజి పౌడర్‌ను 10 నిమిషాలు మరగబెట్టి చల్లార్చాలి. ఈ ద్రావణం 10 కిలోల విత్తనాలపై చల్లి దానికి 200 గ్రాముల రైజోబియం కల్చర్ పౌడర్‌ను బాగా పట్టించి విత్తనం చుట్టూ పొరలా ఏర్పడేలా చూడాలి. పాలిథిన్ సంచి/ ప్లాస్టిక్ తొట్టిలో ఈ ప్రక్రియ చేయవచ్చు. తర్వాత 10 నిమిషాలు విత్తనాలను ఆరబెట్టి పొలంలో నాటుకోవాలి.



అజటో బాక్టర్: పప్పు జాతి పంటలను మినహాయించి మిగతా పంటలకు నత్రజని జీవన ఎరువుగా ఉపయోగపడుతోంది. ఈ బాక్టీరియా నత్రజని స్థిరీకరించడమే కాకుండా మొక్కకు కావాల్సిన పోషకాలను అందిస్తుంది. ఆకు కూరలు, కూరగాయలు, పూలతోటల సాగుకు ఈ విధానం అనుకూలంగా ఉంటుంది. 2 కిలోల కల్చర్ పౌడర్‌ను 200 కిలోల సేంద్రియ ఎరువులో కలిపి విత్తనం నాటే సమయలో ఎకరా నేలపై చల్లాలి. భూమిలో తగినంత తేమ ఉండాలి.

అజోస్పైరిల్లమ్: ఈ బ్యాక్టీరియా మొక్క వేరు చుట్టూ పెరుగుతుంది. లెగ్యూమ్ జాతి పంటలకు తప్పించి మిగతా పంటలైన వరి, పత్తి, మిరప, జొన్న, సజ్జ, పొద్దితిరుగుడు, అరటి తదితర పంటలకు వాడుకోవచ్చు. తక్కువ కాలం పంటలకు 2 కిలోల అజోస్పైరిల్లమ్ కల్చర్‌ను 80–100 కిలోల సేంద్రి య ఎరువులో కలిపి వేసుకోవాలి. నారు ముడి పంటకు 70–80 లీటర్లు పట్టే చిన్నమడిని తయారు చేసుకోవాలి. ఆ నీటిలో 2 కిలోల అజోస్పైరిల్లమ్ ఎరువును కలిపి ద్రావణంలో 10 నిమిషాలు వేర్లను మాత్రమే ముంచి వెంటనే నాటుకోవాలి.



వివిధ రకాల జీవన ఎరువులు

నీలి ఆకుపచ్చ నాచు(సైనో బాక్టీరియా): ఇది వరి పంటకు మాత్రమే ఉపయోగపడే నత్రజని సంబంధిత ఎరువు. ఈ జీవన ఎరువుల్లో నాస్టాక్, ఎనాబినా, కెలోరిక్స్, మొదలైన సైనో బ్యాక్టీరియాలు ఉంటాయి. ఎకరా పొలంలో వరినాట్లు వేసిన 3–7 రోజులకు 4–6 కిలోల జీవన ఎరువులు 40–50 కిలోల సేంద్రియ ఎరువులతో కలిపి చల్లాలి. ఇది వేసిన 15–20 రోజులకు నాచు అల్లుకుపోయిన తర్వాత నీటిని తొలగించి నాచును మట్టిలో కలిసేలా చూడాలి.

అజోల్లా: ఈ జీవన ఎరువు నీటిపై తేలియాడుతూ వరిపొలంలో పెరిగే ఫెర్నోజాతి మొక్క. నత్రజనిని మాత్రమే గాక సేంద్రియ కర్బనం, పొటాషియంలను వరిపైరుకు అందిస్తుంది. వరి నాటిన వారం తర్వాత సుమారు 200 కిలోల అజోలా జీవన ఎరువును ఎకరం పొలంలో వెదజల్లి 15–20 రోజులు నీటిపై పెరగనివ్వాలి. తర్వాత నీటిని తొలగిస్తే 3–4 రోజుల్లో కుళ్లిపోయి మొక్కకు పోషకాలను అందిస్తోంది.

అసిటో బాక్టర్: చెరుకు మాత్రమే ఉపయోగపడుతుంది. మొక్క వేర్లలో కాకుండా పైభాగంలోనూ జీవించి నత్రజనిని మొక్కలకు అందిస్తుంది. ఎకరా చెరుకు పంటలో 4 కిలోల జీవన ఎరువును రెండు దఫాలుగా వాడాలి.

ఫాస్ఫో బాక్టర్: భాస్వరం అందించే ఈ జీవన ఎరువు అన్ని పంటలకు వాడవచ్చు. ఇది బాగా పనిచేసేందుకు సేంద్రియ కర్బరం అత్యవసరం. ఎరువుతో పాటు కలిపి వాడితే మొక్కలకు రోగ నిరోధకశక్తి పెరుగుతుంది. ఎకరాకు 2 కిలోల పాస్ఫోబాక్టర్‌ను 200 కిలోల పశువుల ఎరువులో కలిపి దుక్కిలో మొక్కసాళ్లలో పడేలా చేయాలి. తగినంత తేమ ఉండాలి.

వాడకంలో జాగ్రత్తలు..

- జీవన ఎరువులను ఎండ వేడి తగలని చల్లని ప్రదేశంలో నిల్వ ఉండాలి.
- రైతు వాడే జీవన ఎరువులు ఆ పంటలకు సరైనదై ఉండాలి. ప్యాకెట్‌లో ఉన్న గడువు తేదిలోపు మాత్రమే ఉపయోగించాలి.
- రసాయనాలతో విత్తన శుద్ధి చేసేటపుడు 24–48 గంటల వ్యవధి ఉండాలి. రసాయన ఎరువులతో కలిపి జీవన ఎరువులు వాడరాదు. సమర్థంగా పనిచేసేందుకు నాణ్యత గల సల్చర్‌ను వాడాలి. పొలంలో తగినంత తేమ ఉన్నపుడు మాత్రమే వినియోగించాలి. సేంద్రీయ ఎరువులతో కలిపి వెంటనే పంటకు వాడుకోవాలి.



సెలవుల్లోనూ గ్రంథాలయం తెరవాలి



కేంద్ర గ్రంథాలయం వద్ద ఆందోళన చేస్తున్న నిరుద్యోగ అభ్యర్థులు

శ్రీకాకుళం అర్బన్: ప్రభుత్వ సెలవు దినాల్లోనూ గ్రంథాలయం తెరిచి ఉంచాలని నిరుద్యోగ అభ్యర్థులు, పాఠకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా గ్రంథాలయ కార్యాలయ ఆవరణలో గురువారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో డీఎస్సీ నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో గ్రంథాలయ సమావేశ మందిరాన్ని తమకు కేటాయించాలని కోరారు. దీనిపై గ్రంథాలయ అధికారులు స్పందిస్తూ సెలవు దినాల్లో గ్రంథాలయం తీయడం కుదరదని, సిబ్బంది ఎవరు ఉండరని తెలియజేయడంతో అభ్యర్థులు ధర్నాకు దిగారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే గుండు శంకర్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన సూచన మేరకు ప్రభుత్వ సెలవుదినాల్లో గ్రంథాలయం తీసేందుకు అధికారులు సమ్మతించారు.

దళితులపై దాడి



తీవ్రంగా గాయపడిన జామి భారతి

సంతబొమ్మాళి: మండలంలోని నర్సాపురం పంచాయతీ మాల నర్సాపురం గ్రామానికి చెందిన దళిత మహిళలపై దాడి చేసిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. దళిత మహిళ ఎడ్ల ఈశ్వరి గురువారం ఉదయం కిరాణా షాప్‌కు వెళ్లగా అదే గ్రామానికి చెందిన అవాల సంతు, అవాల గోపి, ఇచ్ఛాపురం ఆనందరావు, చిన్ని శ్రీను, బి.మహాలక్ష్మి, బి.సుబ్బారావులు కలిసి కులం పేరుతో దూషించి దాడి చేశారు. దాడిని అడ్డుకోవడానికి వచ్చిన మరో దళిత మహిళ జామి భారతిపై బండరాయితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. అనంతరం బాధితులు కోటబొమ్మాళి సామాజిక ఆస్పత్రిలో చేరి చికిత్స పొందారు. ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు సంతబొమ్మాళి పోలీసులు తెలిపారు. కాగా, దళితులు తమపై దాడి చేశారంటూ మహాలక్ష్మి తదితరులు రిటర్న్ కంప్లయింట్‌ను సంతబొమ్మాళి పోలీసులకు అందజేశారు. ఇరువర్గాల ఫిర్యాదులపై దర్యాప్తు చేసి చర్యలు చేపడతామని పోలీసులు తెలిపారు.

బ్యాంకు ఉద్యోగుల రక్తదానం



రక్తదానం చేస్తున్న ఎస్‌బీఐ ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ జనరల్ సెక్రెటరీ ఎల్.చంద్రశేఖర్, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ సుష్మా పిలుపు మేరకు శ్రీకాకుళంలోని స్టేట్ బ్యాంకు రీజినల్ కార్యాలయంలో తారకనాథ్ 20వ వర్ధంతి సందర్భంగా గురువారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఎస్‌బీఐ రీజనల్ సెక్రెటరీ కె.సీహెచ్. వెంకటరమణ ఆధ్వర్యంలో రీజనల్ మేనేజర్ అబ్దుల్ హసీబ్ అమీర్, రీజనల్ సెక్రెటరీ కె.సీహెచ్.వెంకటరమణ, ఆఫీసర్స్ రీజనల్ సెక్రెటరీ పొన్నాడ కృష్ణ కిషోర్, రెడ్‌క్రాస్ సొసైటీ స్టేట్ వైస్ చైర్మన్ పి.జగన్మోహన్‌రావు, జాతీయ యువజన అవార్డు గ్రహీత పెంకి చైతన్యకుమార్ శిబిరాన్ని ప్రారంభించారు. జిల్లా స్టేట్ బ్యాంక్ ఉద్యోగులు, అధికారులు 150 మందికి పైగా స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అనంతరం అత్యధిక సార్లు రక్తదానం చేసిన ఉద్యోగులు సురేష్, నాగరాజు, జవహరిని, వసంత, తిరుపతిరావు తదితరులను సత్కరించారు.

నేటి నుంచి డిగ్రీ కాలేజీలకు అఫిలియేషన్ కమిటీలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్న ప్రైవేట్ డిగ్రీ కళాశాలను శుక్ర, శనివారాల్లో అఫిలియేషన్ కమిటీలు పరిశీలించనున్నాయి. వర్సిటీ పరిధిలో ఉన్నత విద్యకు సంబంధించి 106 కళాశాలలు ఉండగా, అందులో డిగ్రీ కళాశాలలు 87 ఉన్నాయి. ముందుగా డిగ్రీ కళాశాలల పరిశీలనకు అఫిలియేషన్ బృందాలు వేశారు. బీఎడ్, బీపీఈడీ, డీపీఈడీ, లా కోర్సుల పరిశీలనకు నిపుణులతో కమిటీలు వేయాల్సి ఉంటుంది. డిగ్రీ కళాశాలల పరిశీలనకు 17 బృందాలు నియమించారు. ఇందులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ స్థాయి అధికారి, సీనియర్ డిగ్రీ కళాశాల అధ్యాపకులు ఇద్దరు ఉంటారు. ఒక్కో కమిటీ ఐదు కళాశాలలు పరిశీలిస్తుంది. ఇందుకోసం ఉన్నత విద్యా మండలి ప్రత్యేక యాప్ రూపొందించింది. ఈ యాప్‌లో భౌతికంగా పరిశీలించిన కమిటీ సభ్యులు, పరిశీలించిన దృశ్యాలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. నిబంధనలు పాటించిన కళాశాలలకు అనుమతులు కొనసాగిస్తారు. పర్వాలేదన్న కళాశాలలకు షరతులతో కూడిన అనుమతులు ఇస్తారు. కనీస ప్రమాణాలు లేని కళాశాలకు అనుమతులు తిరస్కరిస్తారు. ప్రధానంగా సొంత భవనాలా? లీజ్ భవనాలా, క్రీడా మైదానం, తరగతి గదులు, లైబ్రరీ, ల్యాబ్‌లు, టాయిలెట్లు, కొత్త కోర్సులకు దరఖాస్తు చేస్తే అదనపు వసతులు ఉన్నాయా?ఫ్యాకల్టీ, విద్యార్హతలు, అనుమతులు తీసుకున్న చిరునామాలో కళాశాల నిర్వహిస్తున్నారా? ఫైర్ అండ్ సేఫ్టీ పరిస్థితి, ప్రవేశాలు, విద్యార్థుల ఉత్తీర్ణత వంటి అంశాలు పరిశీలిస్తారు. ఉన్నత విద్యా మండలి నిబంధనలు పాటించే కళాశాలలకు అనుమతులు ఇవ్వటం, జూలై ఒకటి తరువాత ప్రవేశాలుపై దృష్టిపెట్టటం వంటి అంశాలు పరిశీలిస్తుంది. ఉన్నత విద్యా మండలి ఆదేశాల మేరకు అఫిలియేషన్ కమిటీలు ఏర్పాటు చేసినట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత తెలిపారు. అర్హత ఉన్న కళాశాలలకు ప్రవేశాల అనుమతులు మంజూరు ఉంటుందని చెప్పారు.

ప్రశాంతంగా ఎన్నికల ప్రక్రియ పూర్తి

- మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై నిఘా
- నెలవారీ సమీక్షలో ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో పోలీసు అధికారులు, సిబ్బంది సహకారంతో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా పూర్తిచేశామని, ఎక్కడా అల్లర్లు, ఘర్షణలకు తావులేకుండా నిష్పక్షపాతంగా, పారదర్శకంగా ఎన్నికలు జరిగేలా ప్రతి ఒక్కరూ కృషి చేశారని ఎస్పీ జి.ఆర్.రాధిక అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం అధికారులతో నెలవారీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో పూర్తిస్థాయిలో మాదకద్రవ్యాల అక్రమ రవాణాను నియంత్రించాలని ఆదేశించారు. కొత్త వ్యక్తుల సమాచార సేకరణ, అనుమానిత వ్యక్తులపై నిఘా, లాడ్జీలు, వాహనాలను విస్తృతంగా తనిఖీ చేసి నేర నివారణా చర్యలు చేపట్టాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై విస్తృతంగా అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలని, గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన దర్యాప్తు పూర్తిచేసి నిందితులపై చార్జిషీటు దాఖలు చేయాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ జి.ప్రేమ్‌కాజల్, డీఎస్పీలు యర్రగుంట శృతి(శ్రీకాకుళం), డి.బాలచంద్రారెడ్డి (టెక్కలి), నాగేశ్వరరెడ్డి (కాశీబుగ్గ), ఎల్.శేషాద్రినాయుడు (ఏఆర్), ఎ.త్రినాధరావు (స్పెషల్‌బ్రాంచి), కె.శ్రీనివాసన్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న అదనపు ఎస్పీ ప్రేమ్‌కాజల్

అధికారులకు ప్రశంసాపత్రాలు..

ఎన్నికలు ప్రశాంతంగా జరగడంలో కృషిచేసిన పలువురు పోలీసు అధికారులకు, సిబ్బందికి జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జి.ఆర్.రాధిక ప్రశంసాపత్రాలు అందజేశా రు. ప్రశంసాపత్రాలు అందుకున్నవారిలో అదనపు ఎస్పీ జి.ప్రేమ్‌కాజల్, డీఎస్పీలు యర్రగుంట శృతి(శ్రీకాకుళం), డి.బాలచంద్రారెడ్డి (టెక్కలి), నాగేశ్వ రరెడ్డి (కాశీబుగ్గ), ఎల్.శేషాద్రినాయుడు (ఏఆర్), ఎ.త్రినాధరావు (స్పెషల్ బ్రాంచి), ఆర్.శ్రీనివాస రావు (దిశా) లే కాక సీఐలు ఎల్.సన్యాసినాయుడు (శ్రీకాకుళం రూరల్), ఎం.అవతారం (ట్రాఫిక్), టి.నిర్మల (ఎలక్షన్ సెల్), ఎస్ఐలు ఎం.ప్రవల్లిక (ఎలక్షన్ సెల్), సత్యనారాయణ (పోలాకి), ఏవో గోపినాథ్, ఆర్ఐ రమేష్, ఏఎస్ఐ రమేష్, ఎలక్షన్ సెల్ కానిస్టేబుళ్లు సంతోష్‌కుమార్, సింహాచలం ఉన్నారు.

ఇంటర్ విద్యార్థుల ఘర్షణ

నరసన్నపేట: స్థానిక కంబకాయ రోడ్డులోని ఓ ప్రయివేటు జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ఫస్టియర్, సెకెండియర్ విద్యార్థుల మధ్య ఘర్షణ కొట్లాటకు దారి తీసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంటర్ విద్యార్థులు తోట ప్రదీప్, బొమ్మళి దేవకుమార్ మధ్య బుధవారం ఘర్షణ చోటు చేసుకుంది. ఈ గొడవ గురువారం విద్యార్థుల స్నేహితులు, కుటుంబ సభ్యులకు చేరింది. ఈ క్రమంలో సాయంత్రం గొట్టిపల్లి వంతెన వద్ద రెండు వర్గాలు ఒకరికొకరు కొట్టుకున్నారు. ఈ ఘటనలో పురుషోత్తంనగర్‌కు చెందిన అరుణ్, రోనక్, చీపురు సూర్య, గుణశేఖర్‌లు గాయపడటంతో ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. నరసన్నపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హోంగార్డుకు చెక్ అందజేత



చెక్ అందజేస్తున్న ఎస్పీ

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా హోమ్ గార్డు యూనిట్‌లో విధులు నిర్వర్తించి ఏప్రిల్‌లో ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డు గొర్లే రాజుకు సహచర హోమ్ గార్డులు ఒక్కరోజు గౌరవ వేతనం సుమారు రూ. 4.17లక్షల చెక్కును గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జి.ఆర్.రాధిక అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ జి.ప్రేమ్‌కాజల్, ఆర్ఐ సురేష్ పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి చెల్లించాలి



మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడా యుగంధర్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గోరు వాసు, కొన్న శ్రీనివాసరావు కోరారు. శ్రీకాకుళం నగరంలో క్రాంతిభవన్‌లో గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. ఎన్నికల హామీ ప్రకారం సీఎం చంద్రబా బు నిరుద్యోగ యువతకు రూ.3వేలు నిరుద్యోగ భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు వై.అప్పలసూరి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

'నీట్' అక్రమాలపై నిరసన



ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైద్య విద్యలో ప్రవేశాలకు నిర్వహిస్తున్న నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలను వ్యతిరేకిస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో శ్రీకాకుళం నగరంలోని అంబేడ్కర్ జంక్షన్ వద్ద గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.హరీష్ మాట్లాడుతూ మోదీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందని మండిపడ్డారు. బాధ్యులను కఠినంగా శిక్షించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష బాధ్యతను రాష్ట్రాలకు తిరిగి అప్పగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి.చందు, సహాయ కార్యదర్శి ఎం.సంతోష్, కమిటీ సభ్యులు భూపతి పవిత్ర, మోహిని సాయి తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం గ్రామానికి చెందిన మైలవరపు లక్ష్మణరావు (29) అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడు. జె.ఆర్.పురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మణరావు పైడిభీమవరంలో కొంతమంది వద్ద అప్పులు చేసి వాటిని తీర్చలేక కోష్టలోని శ్రీకృష్ణ చైతన్య మందిరం సమీపంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో తలదాచుకుంటున్నాడు. సోమవారం వరకు భార్యాభర్తలిద్దరూ కోష్టలోనే ఉన్నారు. ఈ నెల 18న ఉదయం భార్య సౌందర్య పైడిభీమవరంలోని బీసీ కాలనీలో ఉంటున్న ఇంటికి వెళ్లిపోయింది. ఆ రోజు రాత్రి 11 గంటల వరకు భార్యతో ఫోన్‌లో మాట్లాడిన లక్ష్మణరావు బుధవారం రోజంతా ఫోన్ లిఫ్ట్ చేయలేదు. అప్పుల వారు చేస్తున్నారనే ఉద్దేశంతో ఫోన్ లిఫ్ట్ చేయలేదని భావించిన భార్య గురువారం ఉదయం అపార్ట్‌మెంట్‌కు వచ్చింది. గది లోపల గడియపెట్టి ఉండటంతో వాచ్‌మన్ సహాయంతో తలుపు తీయగా లక్ష్మణరావు ఉరికి వేలాడుతూ విగతజీవిగా కనిపించాడు. తీవ్రమైన దుర్వాసన రావడంతో మంగళవారం రాత్రి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. లక్ష్మణరావుకు భార్య, మూడేళ్ల కుమారుడు ఉన్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు జె.ఆర్.పురం ఏఎస్సై రమణమూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిడుగుపాటుకు ఇద్దరు బలి



వెంకటసత్యనారాయణ మృతదేహం



దేవరపల్లి బారికయ్య మృతదేహం

బూర్జ: మండలంలో వేర్వేరు గ్రామాల్లో గురువారం పిడుగుపాటుకు గురై ఇద్దరు మృతిచెందారు. దీంతో ఆయా కుటుంబాలు విషాదంలో మునిగిపోయాయి. అయ్యవారిపేటకు చెందిన చోడవరపు వెంకటసత్యనారాయణ (29) గ్రామ పరిధిలోని పొలాల వైపు ఆవులను మేపేందుకు తీసుకెళ్లాడు. సాయంత్రం ఒక్కసారిగా వర్షం మొదలవడంతో చెట్టు కిందకు వెళ్లాడు. ఆ సమయంలో పిడుగుపడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనతో పాటు రెండు ఆవులు కూడా మృతి చెందాయి. వెంకట సత్యనారాయణకు ఇంకా వివాహం కాలేదు. తండ్రి చోడవరపు సూర్యనారాయణ, తల్లి అచ్చుతమ్మ ఉన్నారు. అందివచ్చిన కొడుకు మృతి చెందడంతో వారు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన మామిడి ధనుంజయరావు కూడా పిడుగుపాటుకు గురై స్వల్పంగా గాయపడటంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

కటకమయ్యపేటలో..

తమ్మినాయుడుపేట పంచాయతీ కటకమయ్యపేటలో దేవరపల్లి బారికయ్య(63) పొలం పనిచేస్తుండగా పిడుగు పడటంతో ఘటనా స్థలం వద్దే మృతి చెందాడు. ఈయనకు భార్య అమ్మన్నమ్మ, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. స్థానిక వీఆర్వోలు ఉమ, పోలుపల్లి సమాచారం మేరకు ఎస్సై జి.వి ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం ప్రభుత్వ రిమ్స్‌కు తరలించారు.